# రాజకీయాలు

**— బలివాడ కాంతారావు**

ఐదేళ్ల తరవాత మా గ్రామం వెళ్లాను.

ఈ ఐదేళ్లలో గ్రామానికి నష్టం తెచ్చినవాళ్లు లాభం చేసినవాళ్ల గురించి తెలుసుకుందామని ఒక్కసారి వూర్లో కాలు పెడితే ఒక చక్కని ఆడది కనపడింది.

ఈ కొత్త ముఖంమీద నా కన్నుపడి మసక కమ్మింది. మావాడు గ్రామ కరణం. వాడి ఆఫీసు ఎత్తయిన సిమెంటు వరండామీద కూర్చుంటే ఆ కోమలి సురూపం సూటిగా చూడొచ్చు. నేనొక్కడినీ వాలు కుర్చీ మీద ఆమె అందం అమృతంగా ఆస్వాదించి ఆవేశపడిపోడానికే కూర్చున్నానని ఆమె పోల్చుకుంది. అందుకేనేమో, ఆ వంపుల సొంపులన్నీ నా కంట పడేట్టు ఆ భంగిమ లేమిటి? మగాడి అవసరాలు తెలుసుకునే ఆడది అరుదుగా తారసపడుతుంది కదా! ఈ అవకాశం వదులుకోకుండానే చూస్తుంటే...

త్రోవంట వెళ్లిపోతూ నన్ను చూసి మర్యాదకు దగ్గరగా వచ్చిన వాడ్ని మొగమాటానికైనా పొమ్మని చెప్పలేకపోయాను. పుచ్చుడు తక్కువవాడు కాడు. భీమబలుడని ఆ వూరికి ఇదివరలో పేరుతెచ్చినవాడు. ఏనుగులా బరువులు మోసినా, ఎవ్వరిమీదా పొరపాటునైనా ఒక వెడుమాట విసరనివాడు. వీడి పెళ్లాం నర్సి వుండే- అది వుత్తి వెర్రిబాగులది! ఈ ఇద్దరికీ పుట్టినవాడు కిష్టిగాడు. ఎంత ప్రయోజకుడవుతాడో వూహించక్కర్లేదు.

''ఈ సదువుకున్న బాబు దగ్గర మాటని మూట చేసుకోవడం నేర్చుకోరా. గవరంగా బతుకుతావు. మాటకు గుట్టెరగక, నానూ మొనగాడినని మా జాతోళ్లను దూరం సేసుకుంటున్నాడు. నాలుగు బుద్దులు సెప్పండి బాబూ'' అని పుచ్చయ్య పొలంవేపు వెళ్లిపోయాడు భుజాన పారతో. నా ఎదరగా కిష్టిగాడు కూర్చున్నాడు. గేరా గిరజాలున్నయ్. నల్లనివాడు గానీ కళ్లు తీక్షణంగా తెల్లగా వున్నయ్. రెప్పలు ఆడనప్పుడు మిడిగుడ్లు నీలమణుల్లా మెరుస్తున్నయ్.

కిష్టిగాడ్ని చిన్నప్పటినించి నాకు తెలుసు. దిగంబరావతారంతో ముక్కంట ఎప్పుడూ చీమిడి కారుతుండేది. పొట్ట ఇప్పుడే తిన్నట్టు ఎప్పుడూ నిండుగా వుండేది. మొలతాడే వుండేది కాదు. పల్లెటూరి బడిలో పలక పట్టుకున్నా అక్షరాలు కనిపించేవి కావు. అరిస్తే మాత్రం కీచురు చెప్పుల్లా శబ్దం చేసేవాడు. ఏడిస్తే వెర్రి నక్కలా అరుపులే! ఇలాంటివాడు గుట్టెరగని మాట లతో ఈ వూరికి లీడరై పోయాడని తోచి —

''లీడరై ఈ వూరికి లాభం తెచ్చావా, నష్టం తెచ్చావా?'' ప్రశ్నించాను.

వాడు సద్దుకుని కూర్చోగానే నా ముఖం అటు ఆ కోమలి ముఖం వాడికి భేటీపడిపోయింది. ఇద్దర్నీ పలకరించినట్లుంది వాడి ముఖంలో ఒక లిప్తలో వెలిగిన చిరునగవు. వెంటనే గంభీరంగా అన్నాడు-

''ఈ వూర్లో రెండు వర్గాలున్నాయ్. ఒకటి మైనరు వర్గం. రెండోది మేలువర్గం. ఒకదానిని ఒకటి విడగొట్టడానికి ప్రతినిత్యం పోరాటం జరుగుతుంటాది.''

''దండోపాయంతో విడగొడ్తారా?''

''ఎంత సంఘ బలం, ఎంత చైతన్యం వున్నా, పదిమంది ఐకమత్యంతో కట్టుకట్టినా మూఠ సంఘాన్ని విడగొట్టలేవు.''

''మూఠ సంఘాలంటే ఏమిటి?''

''ఈ గేమంలో ఒక మూఠి యేభై ఇళ్లున్నాయి. పై వాళ్లవి మూడు వందల గడపలుంటాయి. ఈ మూడు వందల మెజారిటీ వర్గం ఆ యాభై ఇళ్ల మూఠవర్గాన్ని ఏమీ చెయ్యలేదు. ఎందుకు చెయ్యలేకపోతుంది? ఆ మూఠకి జాతి బలం వుంది. చుట్టరికాలతో రక్త సంబంధాలు పెంచుకుని లంకెలు వేసుకున్న ఇనప గొలుసులా వున్నారు. అభిమానం పెంచుకుని ఈ మూఠ కంచుకోటగా వున్నాది.''

''అయితే నివ్వు ఏ మూఠలో వున్నావ్?''

''ఎలాగో ఒకలాగ మంచి సంపాదించుకుని గామంలో పెసిడెంటు అమలులో వున్నాడు. వాడు భాగోతం కంట్రాక్టు పాడినోడితో సమానం. ఇంత డబ్బుకని భాగోతం ఆడినట్టు వూరి ప్రెజ భాగోతుల పంపకం చేసుకుంటున్నాం. ఆ ఒక్కడిమీద పగ పెట్టుకుంటే వూరిమీద పొగ అయిపోతాది. అప్పుడు సిక్కే. అందుకే తగువంటే, కొట్టుకోవడమంటే నాకిష్టం లేదు. నాదీ రాజీవ్ గాంధి పోలసీ. ఎలాగో సరిదిద్దుకో అంటాడు. ప్రాక్టీసైనోలు పల్లకా వూరుకుంటారా? ఆల జోలికి ఎల్లకండా అనాదోడికి సెక్యూరిటీ తెస్తన్నాడు. రెండు పక్కలా కార్యం జరిపించేస్తే ఇక తగు వెక్కడుంటాది?''

''అయితే నీకు మూఠల మీద నమ్మకం లేదన్న మాట.''


''లీడరు ముందు నడిసి ప్రజని నడిపించినా, నిజానికి ప్రెజల ఎనకనే నడుస్తాడు. అప్పుడే ప్రజల తీర్పు ఇనపడతాది. తిరుగుబాటు సెయ్యండని ప్రజ ముందు నడిసి రెచ్చగొట్టేస్తే ఎనక నడిస్తేనే ఎంత రక్తం కారిందో కనిపిస్తాది. ఒకడు సెప్పిన మాట ఇంకొకడు వినడు. అందుకే చిన్నోల దగ్గర ఆడిన చిన్న మాట, పెద్దోల దగ్గర ఆడిన పెద్ద మాటకు ఇలవ లేకండా పోతన్నాది. తెలివితేటలకి గౌరవం ఇచ్చినోలు మూఠల్లో చేరరు.''

తివ్వ కదిపితే డొంకంతా కదులుతుంది. ఇలాగ వీడితో ఎన్ని గంటలు గడిపినా ఏదో ఒక వైనం చెప్తునే వుంటాడు. అటువేపు చూస్తుంటే లోన గుమ్మం దగ్గర కూర్చొని వంగి నా కోసమే అన్నట్టు ఎదురు చూస్తున్న సుందరి వీడిలా అక్కడ గంటలు కూర్చోగలదా? ఎవరి జాడ చూసి ఏ లోపల దాగుండిపోతుందో!

''భేష్ కిష్టయ్య! పంచాయితీ ప్రెసిడెంటు, తరవాత మండల ప్రెసిడెంటు, ఆ తరవాత ఎమ్మెల్లే, చివరకు మంత్రివి కాగల సత్తువ నీలో వుంది...'' అన్నాను.

కిష్టిగాడు పకపక నవ్వాడు. నా మల్లిన దృష్టిని చూసి నవ్వడంలేదు కదా! నవ్వాపి —

''రాసకీయాలంటే ఏమిటి? ఇవ్వటం కానీ తీసు




దీపావళి సరదా. చిత్రం! జె.కె.రీటీ.



కోపటం కుదరదు. ఓటిచ్చి వంద బెనిఫిట్లు అడుగుతారు. వున్న మేరకు సేద్దామంటే వూరుకోరు. ఇటు శత్రుత్వం — అటు మిత్రత్వం. ఈ రెండు వర్గాలు పొటేల్లులాగ పరుగులెత్తి మద్దిన నిల్సున్న నాయకుడికే ఢీ కొడ్తాయి.''

ఇంక వీడి గ్రామఫోను ప్లేటు ఆపేద్దామని ''ఎలక్షను అంటే ఖర్చని ఎమ్మెల్లే అంటే చేదయ్యిందా నీకు?'' అని అడిగాను.

''ఇంతకు ముందు మాకున్న ఎమ్మెల్లే ఎంక్రటావు ఈ పెజ కేటి సెయ్యలేదు సెప్పు? పరామర్శకి ఎందరి గుమ్మా లెక్కలేదు. సెన్నాపురం కాలిపోనాదంటే పొలొచ్చినాడు. సెయ్యవలసిన ఏర్పాట్లన్నీ సేసినాడు. 'నా వూరు రండి, నా స్థలం ఇచ్చి ఇల్లు కట్టిస్తానన్నాడు. 'దానికిష్టం లేకపోతే మీ ఇల్లు కట్టేదాకా మా ఇంట్లో వుండండి!' మాటిస్తే సేసాడన్న మాటే. శుభ్రంగా



ప్రమిదల ముగ్గు    S. పద్మజ

మాటాడే వోడు. తెలివితేట లున్నోడు. తగువుతీర్చగలిగి నోడు. ఇన్ని వున్నా ఇంత సేసినా ఎంక్రటావుకి మొన్నటి ఎలక్సనులో ఈ పెజ ఆదుకున్నారా? ఇప్పుడున్నోడు ఎలా గొచ్చినాడు? అబద్దాలాడి వచ్చి నాడు. ఎన్ని సేస్తానని ఒక్కటి సేసినాడా? ఒక్క అనా దోడికి లోను ఇప్పించగలిగినాడా? పెజల ఏ విషయంలో ఔవన్నాడని వాడింటికి ఎంత మంది జనం కుమ్మేస్తే ఆడు ఇంట్లో వుంటేనా? ఎప్పుడూ హైదరాబాదులో కూర్చుంటాడు. ఈడు సినిమావోడి పేరు సెప్పి ఎమ్మెల్లే అయిపోనాడు గానీ ఈడే కార్యం సెయ్యించాడు?''

"కిష్టిగా చాలా చెప్పావు. మరి వెళ్ళు" అన్నాను.

కిష్టిగాడు నవ్వుతూ —

"ఏరిపో మంటావా?"

"ఎంత చెప్పినా తరగని తంపరలాంటిది కదా రాజకీయం."

"అలాంటిది కాదు బాబో"

"మరెలాటిదిరా?"

"అది నాను సెప్పను గానీ - అవును గానీ! నాను ఇక్కడికి వచ్చిన దగ్గరనించి సూస్తన్నాను మీ దృష్టి ఆ బంగారమ్మ మీదే వున్నాది. గాలికి వదిలేసిన ఆ పువ్వుల ముళ్ళకంపని మీ కాలికి తగిలించుకుంటారేటి? గజ్జి వున్నవాడికి లజ్జ వుండదంటారు. ఆ గజ్జిని అంటించు కుంటారా? దానికి నీ అందం వద్దు సందం వద్దు. నీ నీతి అంతకన్నా వద్దు. నీ సత్తువతో పనిలేదు. నీ డబ్బుతోనే లంకె. దాన్ని వుంచుకున్నోడి కన్నా ఒక వంద హెచ్చు ఇస్తావా? ఆడిని కాలుతో తన్ని నీ ఎంట పడ్తాది. మాటాడమంటావా?"

అలా ఒక్కసారి నిదానించి కిష్టిగాడివేపు చూసాను. వాడు లేచి నిల్చున్నాడు. వెళిపోతున్న వాడితో అన్నాను.

"నీ అయ్య నాదగ్గర నిన్ను నేర్చుకోమన్నాడుగానీ... నీ దగ్గరే — అందమైన, ఆకర్షనీయమైన ఆ రాజకీయం గురించి తెలుసుకున్నాను."

"సదువు లేనోడ్ని — నా కేటి తెలుస్తాది బాబో" అంటూ వెళిపోయాడు.

ఒంటరిగా వున్న నన్ను బంగారమ్మ ఇంకా బాగా కవ్వించడానికి పూనుకుంది.


మా దీపావళి శుభాకాంక్షలు



అన్నపూర్ణ పిక్చర్స్

పవర్ పేట, ఏలూరు-534 002

ఫోన్స్: 21929, 20712

ప్రొపయిటర్-కాకాని వెంకటేశ్వరరావు (బాబు)